క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సోఫియాగ్లోరి

గుడిపాల: మండలంలోని పాపిశెట్టిపల్లె చర్చి వద్ద చలివేంద్రాన్ని మొగరాళ్లపల్లె సర్పంచ్ సోఫియాగ్లోరితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడం వల్ల పాపిశెట్టిపల్లె చర్చి సమీపంలో చీలాపల్లె రోడ్డుపై వెళ్లే ప్రయాణికుల కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. మట్టి కుండలను ఏర్పాటుచేసి తాగునీటిని అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు.

నేడు మేడే సభ

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల నిబంధనలకు లోబడి బుధవారం మేడే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు స్థానిక డీఐ రోడ్డులో కార్మికులతో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులందరూ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

శ్రీవారి భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమిళనాడు నుంచి చిత్తూరు మీదుగా వస్తున్న శ్రీవారి భక్తులకు మంగళవారం దాత పార్థసారథి నాయుడు అన్నదానం చేశారు. నగరంలోని చౌడేశ్వరమ్మ ఆలయంలో వద్ద శ్రీవారి భక్తులకు అన్నదానం అందజేశారు.

నేడు తుమ్మిందలో ఎన్నికల ప్రచారం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు మండల నాయకులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శంకరప్రసాద్, కమిషనర్

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను చిత్తూరు పార్లమెంటు వ్యయ పరిశీలకులు శంకరప్రసాద్ శర్మ పరిశీలించారు. మంగళవారం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కట్టమంచి పాఠశాల, షర్మన్ పాఠశాల, పీసీఆర్ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, వసతులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలవారీగా చేపట్టిన ఏర్పాట్లను, రూట్‌మ్యాప్‌లను కమిషనర్ అరుణ వివరించారు. పరిశీలకుల వెంట మునిసిపల్ ఇంజనీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తవణంపల్లె: వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తవణంపల్లె మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎగువ మారేడుపల్లెలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 47 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

పుంగనూరు: పిల్లలకు చిన్నతనం నుంచి విలువలతో కూడిన విద్య, నడవడిక అవసరమని వీటిని అలవర్చేందుకు శిక్షణ ఇస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని షిరిడిసాయిబాబా జ్ఞానమందిరంలో పిల్లలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్య, ఆటలు, చిత్రలేఖనం, మైండ్‌గేమ్స్, నీతికథలు, వ్యాయామం, సంగీతం, శ్లోకాలు, భగవద్గీత పఠనం, ఓంకార ప్రాధాన్యతలపై ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణకు 6 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాలకు లోబడిన వారు చేరవచ్చునని తెలిపారు.





గుడిపాల: 197రామాపురం పంచాయతీలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ జనార్దన్, చిత్తూరు: గుల్సింగ్స్‌పేట ప్రాంతంలో కార్యకర్తల ప్రచారం, గుడిపాల: చిత్తపార పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మళ్లీ హామీలతో గారడీ చేస్తున్న బాబు

- చంద్రబాబును నమ్మితే మరోసారి మోసపోయినట్లే
- జగనన్న మేనిఫెస్టోకు ప్రజాదరణ
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి




చిత్తూరు : మాపాక్షిలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ బాబు, ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ మరోసారి మోసం చేసేందుకు గారడీ హామీలతో ప్రజల వద్దకు వస్తోందని, ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తిమ్మసానిపల్లె ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టో ఇప్పటికే ప్రజాదరణ పొందిందని, ఆయన చెప్పిన పథకాలన్నీ ఇప్పుడు అమల్లో ఉన్నవేనన్నారు. తన భార్య ఇందుమతి ఊరు అయిన తిమ్మసానిపల్లె డివిజన్‌ను మరింతగా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఒక ఈ ప్రాంతం కాదు నియోజవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని జగనన్న నాయకత్వంలో అభివృద్ధి చేస్తానన్నారు. అధికారంలో వచ్చాక చిత్తూరును మరింత అభివృద్ధి చేయడమే తన సంకల్పమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శోభ, నాయకులు శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి

సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టాలని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ సూచించారు. నగరంలో ఆయనతోపాటు పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక 13వ డివిజన్ మాపాక్షిలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ బాబుతో కలిసి ప్రచారం చేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆలోచించే సంక్షేమ సారథి జగనన్నకు ఓటు వేసి మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాల్లో జరిగిన మేలును అందరికీ తెలియజేశారు. వలంటీర్లపై పగ పట్టిన చంద్రబాబు వారి సేవలను అడ్డుకుని వృద్ధులకు, దివ్యాంగులకు అన్యాయం చేశారని తెలిపారు. పేదలకు జగనన్న మేలు చేస్తేనే చంద్రబాబుకు మనసొప్పలేదని, అలాంటి వ్యక్తి పేదలకు పథకాలు ఇస్తారా అని ప్రశ్నించారు. ఈసారి టీడీపీకి ఓటేస్తే మళ్లీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిందేనని గుర్తుచేశారు. నారాసుర పాలన కావాలా.. సంక్షేమ పాలన కావాలా నిర్ణయించుకునే సమయమిదేనని స్పష్టం చేశారు. జగనన్నకు ఓటేస్తే సంక్షేమ రాజ్యం వస్తుందని, అదే చంద్రబాబుకు ఓటేస్తే సంక్షోభ రాజ్యం వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప వద్దకు రావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. పేదింట పిల్లల భవిష్యత్ బాగుండాలంటే జగనన్నకు మళ్లీ సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నగరంలోని వేలూరురోడ్డు, సీబీరోడ్డులో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పయణి, పద్మ, రేవతి, కోదండ, సెల్వ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. వన్నియర్‌బ్లాక్‌లో కార్పొరేటర్ శశి ఆధ్వర్యంలో గడప గడపకూ వెళ్లి ప్రచారం చేశారు. గూల్సింగ్స్‌పేట ప్రాంతంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

చిత్తూరురూరల్(కాణిపాకం): చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం అనంతాపురం పంచాయతీలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపుతట్టి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు ఎగనామం పెట్టిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. డ్వాక్రా రుణమాఫీ పేరుతో మహిళలకు గుండుకొట్టించి వడ్డీకి..వడ్డీ వేసి కుటుంబాలను వీధుల్లోకి లాగిన దొంగ నాయకులను అసలు నమ్మొద్దని చెప్పారు. చంద్రబాబు మాయమాటలకు మరోసారి మోసపోద్దని తెలిపారు. జగనన్న ఇచ్చే ప్రతి మాటను కూడా శాసనంలా అమలు చేస్తారని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. తదనంతరం జెడ్పీటీసీ సమక్షంలో టీడీపీ కార్యకర్త రాజా పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు అమరనాథ్‌రెడ్డి, రంజన్, భాస్కర్‌నాయుడు, పరందామయ్యానాయుడు, పాండి, అబ్రూ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

గుడిపాల: గుడిపాల మండలంలోని వైఎస్సార్‌సీపీనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇంటింటా ఎన్నికల పచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం 197రామాపురం, 189కొత్తపల్లె, నారగల్లు, నంగమంగళం, చీలాపల్లె, చిత్తపార పంచాయతీల్లో సర్పంచులు జనార్ధన్, పెరిల్లా, మోహన్‌నాయుడు, జయకోడి, రవియాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 99శాతం హామీలను అమలుచేశారని వారికి గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు మాయ మాటలు నమ్మొద్దన్నారు. 2014లో చెప్పినవి ఒక్కటి కూడా చేయలేదని ఓటర్లకు తెలియజేశారు. ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరుంటేనే ఆశీర్వదించండని ధైర్యంగా చెప్పగలిగే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మేనిపెస్టోలో బడ్జెట్‌కు ఎంత అవసరమో అంతే చెప్తాడు గానీ, చంద్రబాబు మాదిరి మాయమాటలు చెప్పలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించినట్లయితే వలంటీర్ల ద్వారా ఇంటివద్దకే పింఛన్లు అందజేయడంతోపాటు సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారిమేఘన్, సాముయేల్, కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, యోవాన్, శ్రీధర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, గోవిందయ్య, ప్రదీప్‌రెడ్డితోపాటు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గుడిపాల: నారగల్లులో ఓటడుగుతున్న నాయకులు



చిత్తూరు: ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ బాబు నాయుడు, నాయకులు



చిత్తూరు: ఓటడుగుతున్న వన్నియర్‌బ్లాక్ కార్పొరేటర్ శశి ప్రచారం






గుడిపాల: చీలాపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం, నంగమంగళంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, 189కొత్తపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్తూరు: ఓటు అభ్యర్థిస్తున్న మహిళా నేతలు ప్రభ, పయణి

ఇంటివద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఇంటివద్దే మెరుగైన వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని చింతగుంటూరు గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రియాంక, కలైవాణి, సుజాతమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భోజన సదుపాయం



కార్యాలయంలో ఏర్పాటు చేసిన భోజనాలు

గుడిపాల: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 12:30 గంటలకు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారాలు ముగించుకొని వస్తున్న వారికి భోజన సదుపాయం కల్పించినట్లు చెప్పారు. దీంతో పాటు ప్రజలు కూడా ఇక్కడకు వచ్చి భోజనం చేయవచ్చని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్

గుడిపాల: ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో గెలిపించాలని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. గొల్లమడుగు పంచాయతీ చింతగుంటూరు గ్రామంలో మంగళవారం పార్టీ నాయకులు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వన్నియకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు జగనన్న పెద్దపీట వేశారని చెప్పారు. అందులో భాగంగా చిత్తూరులో వన్నెకుల కమ్యూనిటీ భవన్ నిర్మాణం కోసం 2 ఎకరాల స్థలం ఇచ్చారన్నారు. వీటి నిర్మాణానికి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి రూ.20 లక్షల విరాళం ఇచ్చారని గుర్తు చేశారు. బీసీలను వాడుకొని పక్కన పెట్టడం తప్ప వారి అభివృద్ధి కోసం టీడీపీ కృషి చేయలేదన్నారు. పదవుల పేరిట పార్టీలో చేర్చుకొని అవసరం తీరాక పక్కన పెట్టడమే వారి నైజమన్నారు. అదే జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యత కల్పించి రాజకీయంగా పదవులు ఇచ్చారని వివరించారు.

వేడుకగా స్నపన తిరుమంజనం



పుర వీధుల్లో దర్శనమిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడు



స్వామివారికి ఆస్థానం నిర్వహిస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, కొలువు తదితర నిత్యకైంకర్యాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. వంసతోత్సవం సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివార్లను వసంతమండపం వద్దకు వేంచేసి మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు వేదపండితులు ఉభయ దేవేరులతోపాటు శ్రీవేణుగోపాల స్వామివారిని పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి, సుగంధ జలాలతో అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల మధ్య వేద పండితులు వేద మంత్రాలతో స్వామి వార్లకు ఆస్థానం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పాలు విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు, భక్తులు స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు గోపాలాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలి మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం నాయనిచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు సులోచనమ్మ(70) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, నాయకులు అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్ తదితరులున్నారు.

కవిత్వంతో ప్రజలను మేల్కొల్పిన మహనీయుడు శ్రీశ్రీ




శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశులు, మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా- అంటూ తన తన కవిత్వంతో ప్రజలను మేల్కొల్పిన మహనీయుడు శ్రీశ్రీ అని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు అన్నారు. మంగళవారం కళాశాలలోని తెలుగు విభాగం శ్రీశ్రీ జయంతిని నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి ప్రిన్సిపల్ మాట్లాడారు. రెండు పదుల వయస్సులోనే తన సాహితీ ప్రస్థానాన్ని మొదలు పెట్టి సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా శ్రీశ్రీ మారారన్నారు. ఆయన కవిత్వం జనం గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటుందన్నారు. ఇదే కార్యక్రమాన్ని పట్టణంలోని కళామందిరంలోనూ నిర్వహించారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి పుస్తకాలను ఆయన చిత్రపటం ముందుంచి నివాళుర్పించారు. నేటి కవులు, రచయితలు శ్రీశ్రీ మార్గంలో పయనించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు వాసు, సజని, నందీశ్వరయ్య, సమితి కార్యదర్శి పుష్ప, చంద్రశేఖరయ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓకు సన్మానం



ఐరాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా ఉద్యోగ విరమణ చేసిన సుగుణవతికి అభినందన సన్మాన సభ స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించారు. సభకు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో 42 సంవత్సరాలుగా సుగుణవతి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సుగుణవతి దంపతులను ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించారు.

మానవత్వం చాటుకున్న ముస్లిం జేఏసీ

- అనాథ వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు



అంతిమ సంస్కారాలు నిర్వహించిన జేఏసీ సభ్యులు

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అనాథ వృద్ధురాలికి మంగళవారం మండల ముస్లిం జేఏసీ సహకారంతో పోలీసులు అంతిమ సంస్కారాలను నిర్వహించారు. ఐదు రోజుల క్రితం గుండ్లకట్టమంచి గ్రామం వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి పక్కన నడిచి వెళ్తున్న వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన విషయం తెలిసిందే. మృతిచెందిన వృద్ధురాలి చిరునామా కోసం పోలీసులు విచారణ సాగించారు. చిరునామా లభించకపోవడంతో మంగళవారం తగ్గువారిపల్లెలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఏఎస్‌ఐ మల్లప్ప, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు ఫిరోజ్ అహ్మద్, సభ్యులు షంషీర్, శేటు, ఫిరోజ్, మాలిక్, శరత్, రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో అబద్ధాల పుట్ట



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఆర్కే సెల్వమణి

నగరి: టీడీపీ మేనిఫెస్టో నమ్మితే భస్మాసుర హస్తం తలపై పెట్టుకున్నట్లే అని మంత్రి ఆర్కేరోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 24, 25వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ పర్యటించి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న జగనన్న నిబద్ధత మేనిఫెస్టో రూపంలో ఉందన్నారు. ఎన్నికల్లో ప్రజలను ఎలాగైనా మభ్యపెట్టి గెలవాలన్న తపన టీడీపీ మేనిఫెస్టోలో కనిపిస్తోందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ చేయాలంటూ నాలుగు రాష్ట్రాల బడ్జెట్ కావాలన్నారు. అప్రమత్తంగా లేకుండా చిక్కుల్లో పడతారని ప్రజలకు వివరించారు. ప్రజల కోసం పని చేసే నాయకులను గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్రానికి జగన్, నగరికి ఆర్కేరోజా అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మంత్రి రోజాకు హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, జ్యోతి, దయానిధి, ఇంద్రయ్య, అమర్, నాయకులు అయ్యప్ప, అమానుల్లా, కృష్ణమూర్తి, తులసి రెడ్డి, సేదు తదితరులు పాల్గొన్నారు.